# అకాల మరణం

నాగేశ్వరశాస్త్రిగారు పోయారని వాళ్ళ వూళ్ళో పెద్దలు కొందరు సంతాపసభ ఒకటి పెట్టారు. ఆయన నాకు బాగా తెలుసు. ఒకప్పుడు నా ఉద్యోగ సంబంధమైన చిక్కు ఒకటొస్తే ఆయనద్వారా ఒక రాజకీయ నాయకుణ్ణి ఆశ్రయించి ఆ చిక్కులోంచి బైటపడడంకూడా జరిగింది.

ఆయన రాజకీయాల్లోనే కాక సాహిత్యంలో, సంగీతంలో, చిత్ర లేఖనంలో, నాటక కళలో కూడా పారంగతత్వం పొందిన వారు. ఆ రంగాలన్నిటిలోను శ్రమా పరిశ్రమా చేస్తున్న అనేకమంది ఏదైనా కార్యక్రమం తలపెడితే ముఖ్య అతిథిగానో, వక్తగానో ఆయన్ని పిలిచి వొప్పించగలిగితే ఆ కార్యక్రమం నిర్విఘ్నంగా కొనసాగి పోతుందన్న ధీమా వుండేది. అరగంట నోటీసులో గంటన్నర ఉపన్యాసం చేయగల నిష్ణాతులు వారు.

ముప్పయి మైళ్ళ దూరాన వున్నాను. వారి కుటుంబ సభ్యులు కొందరు, ఆయన్ని అనేకసార్లు ఆహ్వానించిన సంఘాల పెద్దలు చాలమంది నాకు పరిచయం. వస్తుతః ఆయనంటే నాకు గౌరవం. అంచేత సగంరోజు సెలవుపెట్టి ఆ సంతాప సభకి వెళ్ళేను.

సభకి చాలమందే వొచ్చారు. జిల్లా కలెక్టరుగారు అధ్యక్ష పదవిని అలంకరించేరు. వక్తలుగా పది, పన్నెండుమంది వివిధ రంగాల ప్రముఖులు పేర్లిచ్చేరు. స్థానిక గ్రంథాలయం డాబామీద షామియానా ఏర్పాటుచేసి, సంతాప సభలా కాకుండా ఒక అభినందన సభ అంత హుందాగా జరగడానికి పథకం వేశారు. ఆయన పేరు మీదుగా ఏదో నిధి వసూలుకి కూడా ప్రణాళిక రూపొందించి, ఆయన కుమారుడు రామశాస్త్రికి ఆ నిధిని అందజెయ్యడానికి నిశ్చయం జరిగిందని విన్నాను సభ జరిగే సమయానికి దాదాపు రెండువేలు పోగయ్యిందని కర్ణాకర్ణిగా తెలిసింది. "నేను సైతం" అన్నట్టు నేనున్నూ యథా శక్తిగా గుప్తంగా వేసేనందులో.

"నిజానికి ఆయనకిగాని, ఆయన కుటుంబ సభ్యులకి గాని ఈ 'నిధి' అక్కర్లేదుగా" అన్నాను సంతాప సభ నిర్వాహకుల్లో వొకరైన నారాయణరావుగారితో.

"ఆయనకి అవసరం కదా అనీ ఇవ్వం, మన దగ్గర వున్నది కదా అనీ ఇవ్వం. మనకి ఆయన ఎడల వుండుకున్నటువంటి భక్తి భావాన్ని ఆ విధంగా వ్యక్తపరుస్తాం. అంతే! భగవంతుడికి అవసరమౌతాయనే మన మందరం పుష్పాలూ, నైవేద్యాలూ, హారతులూ ఇస్తున్నామూ?" అన్నాడాయన.

శభాషనుకున్నాను, అనుకున్నాకే నా నైవేద్యం అందించాను.

* * *

సభ అయిపోయాక నాగేశ్వరశాస్త్రిగారి రెండో అబ్బాయి సోమనాథశాస్త్రిని కలుసుకున్నాను. "చాలా విషాదకరమైన సంఘటన–" వంటి మాటలు అయిపోయాక "అసలు ఆయన ఎలా పోయారండి, అంత హఠాత్తుగా?" అని భోగట్టా చేసేను.

"మీకు తెలీదా? ఆయన మొన్నటి ఎన్నికలలో సుబ్బనరసయ్యగారి తరఫున ప్రచారానికివెళ్ళి మీటింగులో గుండెఆగి చనిపోయారు!"

"అలాగా? ఆశ్చర్యంగా వుందే." సుబ్బనరసయ్యగారికి, ఈయనకి గత పాతికేళ్ళనుంచి పరిచయం అనుకుంటాను" అన్నాను.

"ఇంకా ఎక్కువే."

"మరి ఇవాళ సభకి ఆయన కూడా వొచ్చుంటే బాగుండేమో కదండీ!"

"బాగుండేది. కాని, రాలేకపోయారు."

"అదేం అలాగ?"

"ఆయన చాలా విచారంలో వున్నారు. మా నాన్నగారి అకాల మరణానికి ఆయనంతగా మేం కూడా విచారించమేమో అని నా అనుమానం." అన్నాడు సోమనాథశాస్త్రి.

"ఎంత మాటన్నారు బాబూ. మీరు విచారించకపోవడమేమిటి?"

"నిజం అదేమరి — నాన్నగారు ఇరవైమూడో తారీకు సాయంత్రం సుబ్బనరసయ్యగారి సభలో ఉపన్యసిస్తూ గుండె ఆగి చనిపోయారు. చెప్పానుగా!"

"చెప్పారండి."

"అదే ఆఖరి ప్రచార సభ. ఆ తరువాత ప్రచారాలన్నీ చట్టం ప్రకారం ఆగిపోయాయి. సభనించి శవాన్ని తెచ్చి మా ఇంట్లో వొప్ప చెప్పారు. అన్నయ్యకి టెలిగ్రాం ఇచ్చాం. అప్పటికి హైదరాబాద్‌లో గోదావరి ఎక్స్‌ప్రెస్ బయల్దేరేసింది. అన్నయ్య "నేనొచ్చేదాకా వుంచండి" అని టెలిగ్రాం ఇచ్చి ఎవరిదో కారు తీసుకుని బయల్దేరాడు. కుటుంబంతో ఆ కారు అన్నవరం దాకా వచ్చి చెడిపోయింది. ఇరవై నాలుగో తారీకు రాత్రి పది గంటలదాకా అన్నయ్య చేరలేదు. దహన సంస్కారాలు ఇరవయ్యయిదో తారీకుని జరిగాయి. ఆ రోజు నాన్న గారి అంతిమ యాత్రలో దాదాపు వెయ్యిమంది పాల్గొన్నారు. సుబ్బ నరసయ్యగారే సాక్షాత్తు రెండుసార్లు మా ఇంటిదాకా వొచ్చి- "పోయినవాళ్ళతో మనం కూడా పోలేం బాబూ, త్వరగా కార్యక్రమం కానివ్వండి" అని చెప్పారు. ఎవరో అన్నారు- "బాబూ మీకు బోలెడు పని వుంటుంది. ఇవ్వాళ పోలింగుకదా, ఇక్కడ మేం వుంటాం. తమరు పని చూడండి" అని, "నేను తప్పనిసరై తిరుగుతున్నాను. కాని నా మనస్సంతా ఇక్కడే వుం"దంటూ సుబ్బనరసయ్యగారు వెళ్ళారు.

"ఆ రోజు మా యింట్లో వాళ్లుగాని, నాన్నగారి అంతిమ యాత్రలో పాల్గొన్నవారు దాదాపు వెయ్యిమందిగాని వోటు చెయ్య డానికి వెళ్ళలేదు" అని ఆగాడు సోమనాథశాస్త్రి.

నేనేమీ అనలేదు.

"ఫలితం ఏమిటో వూహించారా?" అన్నాడతనే.

"సెలవియ్యండి!"

"సుబ్బనరసయ్యగారికి తొమ్మిది వందల వోట్లలో సీటు పోయింది. అంచేతనే నేనంటున్నాను. నాన్నగారు అకాల మరణం చెందినందుకు మా కుటుంబ సభ్యుల కన్నా ఎక్కువగా ఆయనే విచా రిస్తున్నారని."

(4-3-78)